# భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసమే భూ భారతి

## - కలెక్టర్ రాహుల్ రాజ్



**నార్సింగి, ఏప్రిల్ 25 సిరి న్యూస్:**
భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నూతన భూ భారతి – ఆర్.ఓ.ఆర్ చట్టం ఎంతో దోహదపడుతుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో స్థానిక తహశీల్దార్ షేక్ కరీం ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి – ఆర్.ఓ.ఆర్ చట్టంపై అవగాహన సదస్సును కలెక్టర్ రాహుల్ రాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో కలెక్టర్, ఆర్డీఓ జయ చంద్రా రెడ్డి, షేక్ కరీం మాట్లాడుతూ భూ భారతి చట్టం తో రైతుల భూములకు భద్రత లభిస్తుందని, రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీతో వివిధ రాష్ట్రాలలో అధ్యయనం చేసి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి అమల్లోకి తెచ్చిందని అన్నారు. గతం లో ఉన్న ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు, ముఖ్యంగా రైతులు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, నూతన భూ భారతి చట్టం ద్వారా ఆ సమస్యలు సులభంగా పరిష్కరించ వచ్చని తెలిపారు. ఈ చట్టంలో భూ సమస్యలపై రైతులు మీ – సేవా లో దరఖాస్తు చేసుకోవచ్చని, ధరణి పోర్టల్ లో అలాంటి అవకాశం లేదని, సివిల్ కోర్టుకు వెళ్లాల్సి వచ్చేదని అన్నారు. భూ భారతి చట్టంలో భూ సమస్యల పై తహసీల్దార్ కు ఆపై ఆర్డీఓ, ఆర్డీఓ నుంచి కలెక్టర్, కలెక్టర్ నుంచి ల్యాండ్ ట్రిబ్యునల్ కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారని వివరించారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు కూడా అవకాశం కల్పించిందని పేర్కొన్నారు. ఉపగ్రహం ద్వారా భూముల సర్వే చేసి ఆధార్ నెంబరు లాగా భూములకు భూ ఆధార్ నెంబరు ఇస్తారని, ఎన్ని సంవత్సరాలైనా ఇవి రికార్డుల్లో పదిలంగా ఉంటాయని అన్నారు. ఈ నెల 29 వరకు జిల్లా వ్యాప్తంగా భూ భారతి అవగాహన సదస్సులను పూర్తి చేస్తామని, అనంతరం మే1న జిల్లాలోని ఒక మండలానికి ఎన్నుకుని పైలట్ ప్రాజెక్టు ప్రారంభిస్తామని అన్నారు. జూన్ 2 నుంచి భూ భారతి చట్టం జిల్లా వ్యాప్తంగా అమలు లోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం త్వరలోనే గ్రామ సభలు నిర్వహించి, రైతుల నుంచి వారి సమస్యల వివరాలను సేకరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఆనంద్, ఎం.ఏ.ఒ యాదగిరి, ఎం.పీ.ఓ సయీద్, ఏం.ఎన్.ఓ రామకృష్ణ, ఆర్.ఐ శ్రీధర్, మేఘన, పీ.ఏ.సీ.ఎస్ చైర్మన్ శశిధర్ రెడ్డి, ఏ.ఈ.ఓ విజృంభణ, దివ్య, ఎస్ఐ అహ్మద్ మోహిఉద్దీన్, ఐకేపీ సీసీ శంకర్, సుల్తానా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, రైతులు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# నల్ల పోచమ్మ సన్నిధిలో ఏరులై పారుతున్న మద్యం

**మూడు పువ్వులు ఆరు కాయలుగా మద్యం వ్యాపారం**

**ఎంఆర్పీకి రెట్టింపు ధరలతో జోరుగా దోపిడీ**

**పేరుకు కిరాణం షాపు.. చేసేది మద్యం వ్యాపారం**

**పట్టించుకోని అధికారులు**

**మామూల్లు ఇస్తున్నాం మాకేంటి**

**భయమంటున్న దుకాణదారులు**

**కౌడిపల్లి ఏప్రిల్ 26 సిరి న్యూస్**



. మెదక్ జిల్లాలో రెండవ అతిపెద్ద పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధిగాంచిన కౌడిపల్లి మండలం తునికి గ్రామ శివారులో గల శ్రీ నల్లపోచమ్మ ఆలయం వద్ద ఆలయం వద్ద మద్యం ఏరులై పారుతుంది మూడు పువ్వులు ఆరు కాయలుగా మద్యం విక్రయాలు కొనసాగుతున్న పట్టించుకున్న నాధుడే కరువయ్యాడు. అమ్మవారి ఆలయానికి వందడుగుల దూరంలో యథేచ్చగా బహిరంగా ఎంఆర్పీకి రెట్టింపు ధరలకు మద్యాన్ని విక్రయిస్తూ భక్తులను నిలువు దోపిడీ చేస్తున్నారు.

**పేరుకు కిరాణం.. చేస్తుంది మద్యం వ్యాపారం**

నల్ల పోచమ్మ ఆలయం ప్రాంగణంలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తుల సౌకర్యం కోసం వివిధ షాపులకు గాను ప్రతిఏటా వేలంపాట నిర్వహించి షాపులను వ్యాపారస్తులు దక్కించుకుంటారు. కిరాణం ఇతర వ్యాపారం అని వేలంపాటలో తీసుకొని యథేచ్చగా మద్యాన్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

**మామూళ్ల మత్తులో ఎక్సైజ్ అధికారులు**

నల్ల పోచమ్మ ఆలయం వద్ద విచ్చలవిడిగా మద్యం వ్యాపారం కొనసాగుతున్న ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు.ఎవరైనా అధిక ధరల గురించి ప్రశ్నిస్తే మేం బరాబరి ఎక్సైజ్ అధికారులకు డబ్బులు ఇస్తున్నాం ఏం చేసుకుంటారో చేసుకోండి అని బెదిరింపులకు దిగుతున్నారు.

**పర్మిట్ రూములను తలపించేలా సిట్టింగ్ రూంలు**



కిరాణా షాప్ ల పైన వ్యాపారమని రూములు తీసుకుని వాటి వెనకాల సిట్టింగ్ రూములను తలపించేలా రూమ్ లో ఏర్పాటుచేసి మద్యాన్ని విక్రయిస్తున్నారు. బహిరంగంగా ఫ్రిడ్జ్ లలో డిస్ప్లే పెట్టి అమ్ముతున్నా పట్టించుకున్న నాథుడే లేడు.

**కట్టడి చేయాలని భక్తుల వేడుకోలు**

ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రం వద్ద ఇలా మద్యం విక్రయం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు పైసా పైసా కూడా పెట్టుకుని పుణ్యక్షేత్రానికి వస్తే జేబులకు చిల్లు పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు కలగజేసుకొని అక్రమ మద్యం అమ్మకాలను అడుకట వేయాలని కోరుతున్నారు.

# ఉగ్ర దాడికి నిరసనగా మసీదులలో నల్ల బ్యాడ్జీలతో ప్రార్థనలు

**మెదక్ ప్రతినిధి, ఏప్రిల్ 25 సిరి న్యూస్:**



జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా మెదక్ పట్టణంలోని జామా మసీదులోని శుక్రవారం నాడు ఉర్దూ జర్నలిస్టులు మహ్మద్ రియాజుద్దీన్, మహ్మద్ ఇంతియాజుద్దిన్, మహ్మద్ యూసుఫ్ అలిలు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రార్ధనలు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉగ్రవాదులు చేసిన దాడిని ముక్తకంఠంతో ఖండించాల్సిన అవసరం ఉన్నదని ఇటువంటి దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకొని ఉక్కు పాదంతో అణిచివేయాల్సిన సమయం ఆసన్నమైనదని వారు తెలిపారు. ఈ యొక్క దాడి జమ్ము కాశ్మీర్ పైన కాదని యావత్ భారతదేశంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఉగ్రవాదానికి మతానికి ఎటువంటి సంబంధాలు ఉండవని ఉగ్రవాదాన్ని అన్ని వర్గాల ప్రజలు ప్రతి భారతీయ పౌరుడు ఖండించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌లు తక్షణమే ఈ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పాలని వారు డిమాండ్ చేసారు.

# ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షం

**చేతికొచ్చిన వరి పంట నష్టంతో తీవ్ర ఆందోళనలో రైతన్నలు**

**ఆరుగాల కష్టం నీటి పాలు కావడంతో ద**

**బిక్కుబిక్కుమంటూ దిక్కు తోచని స్థితిలో రైతులు**

**వెల్దుర్తి ఏప్రిల్ 25, సిరి న్యూస్:**



వెల్దుర్తి మండలం లో శుక్రవారం సాయంత్రం కురిసిన ఈదురుగాలతో కూడిన భారీ వర్షానికి మండలంలోని అన్ని గ్రామాలలో భారీగా నష్టపోయిన రైతులు. వెల్దుర్తి మండల పరిధిలోని పలు గ్రామాలతో పాటు మండల కేంద్రంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో ఎండబెట్టిన వరి ధాన్యం వరి కోతకు వచ్చిన వరి పంటకు భారీ నష్టం వాటిల్లింది అని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం పడడంతో రైతులకు కన్నీరే మిగిలిందని కొంతమంది రైతులు ఆవేదన వ్యక్తం చేశారు . వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్దకు. ఎండబెట్టి తీసుకొచ్చిన పంట తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం చేసిన కష్టమంతా తడిసి రోడ్డుపైన పారుతుంటే దిక్కుతోచని స్థితిలో రైతులు, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నారు.